సాక్షి సంగారెడ్డి
శుక్రవారం । 8 । నవంబర్ । 2024

నాన్న ప్రోత్సాహంతోనే..

చిన్నప్పటి నుంచి రాజీలేకుండా ఎంత వరకైనా, ఎంతటి విద్యనైనా నేర్చుకోమని, చేసే ఉద్యోగం నలుగురికి సహకారం అందాలని నాన్న చెప్పేవారు. చేసే ఉద్యోగం ఉన్నతమైనదిగా ఉండి, ప్రజా సేవ చేయాలని చెప్పిన నాన్న మాటలే నేను ఉన్నత ఉద్యోగం సాధించేలా చేశాయి. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుకొని, విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. 'సాక్షి' తో ఆయన మరిన్ని విషయాలు పంచుకున్నారు.

10లో



న్యూస్‌రీల్

హమాలీల సంక్షేమం కోసం చట్టం తేవాలి

- ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి డిమాండ్



నారాయణఖేడ్: హమాలీలతో సమావేశమైన చిరంజీవి

నారాయణఖేడ్: హమాలీ కార్మికుల సంక్షేమం కోసం చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం ఖేడ్‌లో ఆయన హమాలీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హమాలీలు సిమెంట్, ఫర్టిలైజర్ తదితర దుకాణాలకు సంబంధించిన సామగ్రిని తరలిస్తూ చాలీచాలని డబ్బులతో కుటుంబాల పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యేక సంక్షేమ చట్టం తీసుకురావడంతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అర్హులకు పింఛన్లు ఇవ్వాలన్నారు. సంఘనాయకులు భాస్కర్, వెంకట్, సాయిలు, లక్ష్మయ్య, పోచయ్య, సంగమేశ్ పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్‌గా బాలరాజ్

కల్హేర్(నారాయణఖేడ్):కల్హేర్ మండల నాయబ్ తహసీల్దారుగా బాలరాజు బాధ్యతలు చేపట్టారు. అమీన్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న బాలరాజును కల్హేర్ మండల నాయబ్ తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం తహసీల్దార్ శివశ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ సిబ్బంది నాయబ్ తహసీల్దార్ బాలరాజును సన్మానించారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం

- జెడ్పీ పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించిన సేవోర్గం స్వచ్ఛంద సంస్థ



అందజేసిన ఎన్‌సీసీ యూనిఫాంతో విద్యార్థులు

నారాయణఖేడ్: దాతల సహకారం విద్యాభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని ఖేడ్ జడ్పీహెచ్ఎస్ పీజీహెచ్ఎం మన్మథకిషోర్ అన్నారు. యువకుడు బసవచైతన్య సౌజన్యంతో ఎన్‌సీసీ విద్యార్థులకు ఎన్‌సీసీ దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో 40 గ్రామాలకు చెందిన 800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలోనే సేవోర్గం ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్ రూ.4 లక్షల విలువచేసే క్రీడాసామగ్రితోపాటు పలువురు దాతల సహకారంతో రూ.2 లక్షల విలువచేసే సౌండ్‌సిస్టమ్, బ్యాగులు, ఇతర విద్యాసామగ్రిని అందించారన్నారు. దాతల సహకారం ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. దాతతోపాటు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు, సభ్యులు చంద్రశేఖర్, రాజుకుమార్, జైపాల్‌రెడ్డి, మల్లేశం, హమీద్, రాజయ్య, రాజశేఖర్, సంగ్రాం పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ సంబంధ విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ...పేదలు, పిల్లలకు, మహిళలకు, ఖైదీలకు ఉచితంగా ప్రభుత్వం తరఫున న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. ప్రజలు దానిని వినియోగించుకోవాలని సూచించారు. కోర్టులో కేసు విచారణ ఏ విధంగా జరుగుతుందో విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా వివరించారు. ఉచిత న్యాయ సేవలను పొందడానికి టోల్ ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా పోక్సో చట్టంలోని అంశాలను, ఆ చట్టం ద్వారా విధించే శిక్షలను వివరించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రజలు తమ ఫోన్లకు వచ్చే అపరిచిత కాల్స్‌కు సమాధానమివ్వద్దని సూచించారు. ఉచితంగా న్యాయసహాయాన్ని అందించేందుకు జిల్లా న్యాయ సేవా సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.

చెరుకు రైతుకు తీపి కబురు



టన్నుకు రూ.250 మేర పెంచిన కేంద్రప్రభుత్వం

- తాజా పెంపుతో టన్నుకు రూ.3,682 అందుకోనున్న రైతులు
- నేడు 'గోదావరి-గంగా' కర్మాగారంలో క్రషింగ్‌కు శ్రీకారం
- క్రషింగ్ ఊసేలేని ట్రైడెంట్
- జహీరాబాద్‌జోన్ చెరుకు ఇతర కర్మాగారాలకు



జహీరాబాద్: చెరుకు రైతులకు కేంద్రం తీపి కబురు అందించింది. 2024–25 క్రషింగ్ సీజన్‌కు గాను చెరుకు కనీస మద్దతుధరను టన్నుకు అదనంగా రూ.250ల మేర పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తాజా పెంపుతో టన్నుకు రూ.3,682ల మేర చెరుకు రైతులకు అందనుంది. 2023–24 క్రషింగ్ సీజన్‌కుగాను టన్నుకు కనీస మద్దతు ధరను రూ.3,150గా ప్రకటించింది. ఈ సీజన్‌కుగాను పెంచిన ధర మూలంగా టన్నుకు రూ.3,400మేర కనీస మద్దతు ధరను నిర్ణయించింది. దీంతో టన్నుకు రూ.200లకు పైగా ధర పెరగనుంది. ఆయా కర్మాగారాలు గత సీజన్‌లో సాధించిన రికవరీని పరిగణనలోకి తీసుకుని చెరుకు ధరను ప్రకటించనున్నాయి.

కర్మాగారాల్లో రికవరీ ఆధారంగా చెల్లింపులు

సంగారెడ్డిలోని గణపతి చక్కెర కర్మాగారం గతేడాది రికవరీని పరిగణనలోకి తీసుకుని టన్నుకు రూ.3,487.70 చెల్లించాల్సి ఉండగా, యాజమాన్యం అదనంగా టన్నుకు రూ.112.30లు కలిపి రూ.3,600 చెల్లించింది. ఈ సీజన్‌కుగాను రికవరీ ఆధారంగా టన్నుకు రూ.3,682.20లుగా ధరను నిర్ణయించింది. యాజమాన్యం ఇచ్చిన అదనపు ధరను పక్కన పెడితే గతేడాది కంటే రూ.194.50 అదనంగా లభించనుంది. యాజమాన్యం గతేడాది మాదిరిగానే ఈ ఏడాది అదనపు ధర ఎంతమేర చెల్లించనుందనే విషయం ఇంకా ప్రకటించలేదు. అదనపు ధరను ప్రకటిస్తే టన్నుకు రూ.300లకు పైగా లభించే అవకాశం ఉన్నట్లు రైతులు లెక్కలు కడుతున్నారు. అదనపు ధరను క్రషింగ్ ప్రారంభం రోజున ప్రకటించే అవకాశం ఉంది.

గణపతి షుగర్స్‌కు తక్కువ కాకుండా 'గోదావరి–గంగా'చెల్లింపులు!

రాయికోడ్ మండలంలోని మాటూరు గ్రామంలోని 'గోదావరి– గంగా'యాజమాన్యం ఈ సీజన్‌కుగాను కొత్తగా క్రషింగ్‌ను చేపట్టనుంది. దీంతో ధరను మాత్రం ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. గణపతి చక్కెర కర్మాగారం చెల్లించే ధరకు తక్కువ కాకుండా చెల్లించే అవకాశం ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. కామారెడ్డిలోని గాయత్రి షుగర్స్ కర్మాగారం గతేడాది టన్నుకు రూ.3,472.35ల ధర చెల్లించింది. మాగిలోని కర్మాగారం టన్నుకు రూ.3,463.14ల ధరను చెల్లించింది. ఈ సీజన్‌కు గాను ఆయా కర్మాగారాలు టన్నుకు రూ.3,682లు తగ్గకుండా చెల్లించే అవకాశం ఉన్నట్లు అధికర వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్తకోటలోని కృష్ణవేణి కర్మాగారం గత సీజన్‌కుగాను రూ.3,340.34 ధర చెల్లించింది. ఈ సీజన్‌కుగాను ఎంత మేర ధరను చెల్లించనుందనే విషయమై ప్రకటించలేదు.

నేడు 'గోదావరి–గంగా'లో క్రషింగ్

రాయికోడ్ మండలంలోని మాటూర్ గ్రామంలో కొత్తగా నిర్మించిన గోదావరి–గంగా చక్కెర కర్మాగారంలో క్రషింగ్‌ను ఈనెల 8న ప్రారంభించనున్నారు. కర్మాగారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నారు. ఈ కర్మాగారం జోన్ కిందకు జహీరాబాద్ పరిధిలో ఉన్న కోహీర్, ఝరాసంగం, రాయికోడ్, వట్‌పల్లి మండలాలను చేర్చారు. కర్మాగారంలో సుమారు 3లక్షల టన్నుల చెరుకును గానుగాడించాలనే లక్ష్యంతో యాజమాన్యం ముందుకు వచ్చింది.

క్రషింగ్ ఊసేలేని 'ట్రైడెంట్'

జహీరాబాద్‌లోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారం ఈ సీజన్‌కుగాను క్రషింగ్‌ను ప్రారంభించే విషయమై ఎలాంటి సమాచారం లేదని రైతులు, అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు క్రషింగ్‌కు సంబంధించి ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. గత సీజన్‌లోను కర్మాగారం క్రషింగ్‌ను నిర్వహించలేదు. ఈ సీజన్‌లో సైతం క్రషింగ్ అనుమానంగానే ఉందని రైతులు అంటున్నారు. దీంతో జోన్ కింద ఉన్న జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాలను ఇతర కర్మాగారాలకు కేటాయించారు. ట్రైడెంట్ జోన్‌ను ఫ్రీ జోన్‌గా ప్రకటించారు. ఆయా మండలాల్లో సాగులో ఉన్న చెరుకు పంటను సంగారెడ్డిలోని గణపతి, కామారెడ్డి, మాగిలోని గాయత్రి, వనపర్తి కొత్తకోటలోని కృష్ణవేణి కర్మాగారాలకు తరలించుకునేందుకు అవకాశం కల్పించారు. ఆయా కర్మాగారాలకు చెరుకును తరలించుకునే రైతులకు 40 కిలోమీటర్లకు మించి చెరకును తరలించుకున్నట్లయితే ఇందుకయ్యే రవాణా ఖర్చులను ప్రభుత్వం చెల్లించనుంది. ట్రైడెంట్ యాజమాన్యం చెరుకు రైతులకు ఇంకా రూ.11.98లక్షలు, కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు రూ.31.66లక్షలు బకాయి పడింది. ఈ కర్మాగారాన్ని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ కిందకు(ఎన్‌సీఎల్‌టీ) చేర్చారు.

మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు

- అందోల్‌లో మినీ స్టేడియం నిర్మాణం
- గాంధీపార్క్‌లో కూరగాయల మార్కెట్
- మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి
- వట్‌పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన మంత్రి



అందోల్ వద్ద 1141 సర్వే నంబరులోని స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి దామోదర

జోగిపేట/వట్‌పల్లి (అందోల్): జోగిపేటలో ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న మైనార్టీ గురుకుల పాఠశాలలకు సొంతంగా భవనాలను నిర్మించేందుకుగాను అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ హామీనిచ్చారు. అందోల్ వద్ద నర్సింగ్ కళాశాల కోసం సిద్ధం చేస్తున్న భవనాన్ని, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. అందోల్‌లో భవన నిర్మాణానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఆర్డీఓకు ఆదేశించారు. గురుకుల, కస్తూర్బాగాంధీ పాఠశాలలో తరగతులను డిజిటలైజేషన్‌గా మార్చాలని, ఆర్‌వో ప్లాంట్‌లను ఏర్పాటు చేయించాలని, స్వల్ప మరమ్మతులు చేపట్టాలని ఉపాధ్యాయులు మంత్రిని కోరగా ఇందుకు సానుకూలంగా స్పందించారు. సంబంధిత పనులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బాలికలకు సంబంధించిన విద్యాసంస్థలన్నీ ఒకే చోట ఉండాలని, అందోల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలన్నదే తన లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్ కళాశాల వద్ద మోడల్ బస్‌షెల్టర్‌ను నిర్మిస్తామన్నారు. 1141 సర్వే నంబర్‌లో మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, పంపించాలని అధికారులను ఆదేశించారు.

గాంధీ పార్కులో కూరగాయల మార్కెట్

జోగిపేటలోని గాంధీ పార్కులో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఆర్డీవో పాండు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్ డేవిడ్, కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, ఆకుల చిట్టిబాబు, డి.శివశంకర్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాజకీయపార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. గురువారం వట్‌పల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం అభినందన సభకు జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కర్‌తో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశేషరెడ్డి, వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వర్‌ను పాలకవర్గ సభ్యులకు ఈ సందర్భంగా మంత్రి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు, ప్రజలకు తాను అండగా ఉండాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వారి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. అల్లాదుర్గం మెటల్ కుంట, జోగిపేట – వట్‌పల్లి, సంగుపేట– పుల్కల్, అందోల్ నియోజకవర్గంలోని,రోడ్ల మరమ్మతు పనులు రూ.152 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. వట్‌పల్లిలో నూతన పోలీస్ స్టేషన్ భవనం, మండల కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, మండల మహిళా సమాఖ్య భవనం ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపనలు చేస్తామన్నారు.

కులగణనను విజయవంతం చేయండి



బొదత్‌పూర్‌లో కులగణన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రాష్ట్ర ప్రభుత్వం కులగణనను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి ఈ సర్వేను ప్రజలు విజయవంతం చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. నాగల్‌గిద్ద మండలం ఔదత్‌పూర్ గ్రామంలో గురువారం కులగణనకు సంబంధించిన ప్రక్రియను డోర్ స్టిక్కర్లు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...సర్వేకు గ్రామాలకు వచ్చే అధికారులకు ఇంటి యజమానులు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. వలసవెళ్లిన వారి కుటుంబ వివరాలను, డోర్ లాక్ చేసి ఉన్న కుటుంబాల వివరాలను గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ఆయా కుటుంబసభ్యులకు తెలియపరచి నమోదు చేయించాలన్నారు. రాష్ట్రంలోనే ఖేడ్ నియోజకవర్గం రోల్‌మోడల్‌గా నిలిచేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. సమావేశంలో ముఖ్య నాయకులు నర్సింగ్‌రావు పాటిల్, గుండేరావు పాటిల్, అనిల్, సంజీవ్, ఆకాశ్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేయాలి

- డీఈఓ వెంకటేశ్వర్లు పిలుపు
- ఈనెల 21 నుంచి 23 వరకు సంగారెడ్డిలో వైజ్ఞానిక ప్రదర్శన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఈ నెల 21,22, 23వ తేదీల్లో జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనను జయప్రదం చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు కోరారు. గురువారం జిల్లా సైన్స్ కేంద్రంలో 11 కమిటీ కన్వీనర్‌లు, కో కన్వీనర్‌లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ...ఈ వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేసేందుకు 11 కమిటీలను నియమించామన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనకు వచ్చే విద్యార్థులకు, టీచర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలగకుండా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అరుణ, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, మాజీ సైన్స్ అధికారి విజయ్ కుమార్, నోడల్ అధికారి లింబాజీ, సంగారెడ్డి మండల విద్యాధికారి విద్యాసాగర్, కోహిర్ మండల విద్యాధికారి జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఇందిరా క్రాంతి పథకంలో పని చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు వారికి కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్యభవన్‌లో గురువారం ఐకేపీ వీఓఏల జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ...సందర్భంగా ఐకేపీ వీఓఏలు గత 20 ఏళ్ల నుంచి అనేక రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలందరికీ అందేవిధంగా సేవలందిస్తున్నారన్నారు. అయితే వీరికి మాత్రం కనీస వేతనం, చట్టపరమైన సౌకర్యాలు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాటాల సందర్భంగా ప్రభుత్వాలు హామీలు ఇస్తున్నా అవి అమలు చేయడంలో చిత్తశుద్ధి కనిపించడంలేదని మండిపడ్డారు. గ్రామ సంఘాలకు బకాయి ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్ ఇవ్వడంతోపాటు ప్రతీ గ్రామ సంఘానికి ఒక ట్యాబ్, నెట్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ జీవో ప్రకారం గ్రామ సంఘం నుంచి రూ.3 వేలు వేతనం ఇవ్వాలని కోరా రు. ఐకేపీ వీఓఏలకు రూ.20 లక్షల బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11, 12 తేదీల్లో జరిగే కలెక్టర్ ఆఫీస్ వద్ద నిర్వహించే ధర్నాకు జిల్లాలోని వీవోఏలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ముగిసిన 68వ స్కూల్ గేమ్స్

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు గురువారం ఘనంగా ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమూల్యమ్మ ఆధ్వర్యంలో జరిగిన పోటీలో మొదటి స్థానంలో ఆదిలాబాద్, రెండవ స్థానంలో నల్లగొండ, మూడవ స్థానంలో మహబూబ్ నగర్ నిలిచాయి. గెలుపొందిన జట్లకు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..ఆటలో గెలుపోటములు సహజమన్నారు. ఎవరూ అధైర్య పడకుండా బాగా ఆడాలని కోరారు. ఈ పోటీలో 18 మంది జాతీయస్థాయికి ఎంపికయినట్లు తెలిపారు. కార్యక్రమంలో హోప్ న్యూరో డాక్టర్ కృష్ణమూర్తి, లింగ ఫౌండేషన్ డైరెక్టర్ ఉషారాణి, క్రీడల అధికారి ఖాసీంబేగ్, విట్టల్ గౌడ్, సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ రాజు.. బదిలీకి బ్రేక్

- జహీరాబాద్ ఆర్డీఓ రాజు ఇక జిల్లాలోనే..
- నిమ్జ్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్
- యువ ఉన్నతాధికారి సేవలు ఇక్కడే వినియోగించుకోవాలని నిర్ణయం



ఎస్.రాజు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జహీరాబాద్ ఆర్డీఓ, సంగారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీఓగా ఉన్న ఎస్.రాజు బదిలీకి బ్రేక్ పడింది. ఈ యువ ఉన్నతాధికారి సేవలను జిల్లాలోనే వినియోగించు కోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులకు బదిలీలు జరిగాయి. రాజును మహబూబాబాద్ ఆర్డీఓగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే విధి నిర్వహణలో చురుగ్గా వ్యవహరిస్తూ మంచి పేరు తెచ్చుకున్న రాజు సేవలను జిల్లాలో వినియోగించుకోవాలని నిర్ణయించారు. సంగారెడ్డి ఆర్డీఓగా పనిచేసిన వసంత కుమారిపై బదిలీ వేటు పడిన తర్వాత చాలా రోజులు ఇన్‌చార్జి ఆర్డీఓ బాధ్యతల్లో కూడా ఈయన కొనసాగారు. జిల్లాలో అత్యధికంగా పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించడంలో చాలా కీలకంగా వ్యవహరించారు. ఏకంగా కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, మండలాల వారీగా ధరణి సమస్యలను దగ్గరుండి పరిష్కరించారు. దీంతో రాజును ఇతర జిల్లాలకు బదిలీ చేయవద్దని జహీరాబాద్ ప్రాంత నేతలు కూడా జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాజు బదిలీ ఆగిపోయిందనే అభిప్రాయం రెవెన్యూ వర్గాల్లో వ్యక్తమవుతోంది. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి కూడా రాజు సేవలు ఇక్కడ అవసరమనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం.

నిమ్జ్ భూసేకరణ బాధ్యతలు..

నిమ్జ్ భూసేకరణ బాధ్యతలను రాజుకు అప్పగించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటివరకు జహీరాబాద్ రెగ్యులర్ ఆర్డీఓగా వ్యవహరించిన రాజు ఇకపై అదే ప్రాంతంలోని నిమ్జ్ యూనిట్–2 భూసేకరణ అధికారిగా విధులు నిర్వర్తించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్జ్ భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. స్థానికంగా మూడు లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం 2012లో నిమ్జ్‌ను ఏర్పాటు చేసింది. న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో మొత్తం 12,635 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. తొలివిడతలో 2,892 ఎకరాలను సేకరించింది. ప్రస్తుతం రెండో విడత భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- మల్కాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



మల్కాపూర్‌లో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి తదితరులు

కొండాపూర్/ సదాశివపేట(సంగారెడ్డి): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మల్కాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గురువారం సందర్శించి అక్కడ ధాన్యం సేకరణ ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న వ్యవస్థను, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తమ పంటను రాశుల్ని, ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని నిల్వ చేయడానికి కొత్త గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

వేగంగా ధాన్యం సేకరణ

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ వేగంగా కొనసాగుతోందని కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. ధాన్యం సేకరణ, కొనుగోలు వివరాలను ఓపీఎంఎస్ (ఆన్‌లైన్ పర్చేస్ మానిటరింగ్ సిస్టమ్), లోకల్ యాప్‌లో నమోదు చేయడం వల్ల డిజిటల్ ట్రాకింగ్ సులభమవుతుందన్నారు. సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని తొగర్‌పల్లి జరుగుతున్న కులగణన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సర్వేలో ప్రజలు పూర్తి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లలో అవకతవకలకు అవకాశమివ్వొద్దు

పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. గురువారం ఆత్మకూర్ రోడ్డులోని వెంకటేశ్వర కాటన్ మిల్లులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సీసీఐ కొనుగోలు కేంద్రంలో అమ్మని రైతులకు ప్రైవేటు కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి నష్టం జరగకుండా చూడాలన్నారు.

క్లుప్తంగా

నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: ఉపాధ్యాయ సంఘం(తపస్) మొగుడంపల్లి మండల అధ్యక్షుడిగా ధనసిరి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మల్లయ్యస్వామి ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా గురువారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జాడి మల్కాపూర్ టీచర్ మొగులయ్య ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, రాష్ట్ర నాయకులు నర్సింహ్మారెడ్డి, గోపాల్, తుక్కప్ప పలు మండలాల నాయకులు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లయ్యస్వామి తపస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోల్డెన్ అవర్‌ను వినియోగించుకోండి

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: సైబర్ బాధితులు గోల్డెన్ అవర్‌లోనే ఫిర్యాదు చేస్తే నేరస్తులు దోచుకున్న నగదును బ్లాక్ చేసి తిరిగి ఇవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి సూచించారు. గురువారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మైక్రోసాఫ్ట్ సహకారంతో టీఎస్ కేసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అధ్యాపకులకు నిర్వహిస్తున్న రెండో రోజు శిక్షణ శిబిరంలో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అత్యాశకు పోయి మోసపోవద్దని హెచ్చరించారు. ముందు అధ్యాపకులు అవగాహన పొందితే, అనంతరం విద్యార్థులకు నేర్పవచ్చని, వారి ద్వారా కూడా సమాజంలో చైతన్యం పెరిగి సైబర్ నేరాల కట్టడికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ సమన్వయకర్త ప్రవీణ, అధ్యాపకులు యోగిబాబు, నీట్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ నంబర్ ఉందని రూ.60 వేలు కాజేశారు

మనీ లాండరింగ్ కేసులో ఉన్నావంటూ సైబర్ మోసం

పటాన్‌చెరుటౌన్: సైబర్ నేరగాళ్లు వివిధ రకాల కొత్త ఎత్తులతో అమాయకుల్ని మోసగిస్తున్నారు. తాజాగా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని మనీలాండరింగ్ కేసులో అతడి ఆధార్, ఫోన్ నంబర్‌లు ఉన్నాయంటూ బెదిరించి రూ.60 వేలు కాజేశారు సైబర్ నేరగాళ్లు. ఈ ఘటనకు చెందిన వివరాలిలా ఉన్నాయి. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన ఐటీ ఉద్యోగికి ఈనెల 4న మనీలాండరింగ్ కేసులో ఉన్నావని ఆధార్, ఫోన్ నంబర్లు ఉన్నాయని ఓ వ్యక్తి కాల్ చేసి బెదిరించాడు. ఈ కేసునుంచి బయటపడాలంటే తాము చెప్పిన విధంగా రూ.65వేలు వేయాలని చెప్పడంతో సదరు బాధితుడు తన అకౌంట్ నుంచి డబ్బులు జమచేశారు. అనంతరం తిరిగి మళ్లీ నగదు చెల్లించాలని మరోసారి అడగడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

నారాయణఖేడ్: ఎండు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ శంకర్, ఎస్సైలు హన్మంత్, అనుదీప్ సిబ్బందితో కలిసి గురువారం తెల్లవారుజామున ఖేడ్- కంగి మార్గంలోని ఖేడ్ మండలం అబ్బెంద పెట్రోల్ బంకు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కిషన్ నాయక్ తండాకు చెందిన కర్ర గోపాల్ బైక్‌పై వస్తుండగా ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద 1.102 కిలోల ఎండు గంజాయి లభించింది. అబ్బెంద కింది తండాకు చెందిన నేనావత్ జీవన్ వద్ద రూ.10 వేలకు గంజాయిని కొని ఖేడ్‌కు తరలిస్తున్నట్లు గోపాల్ నేరం ఒప్పుకున్నాడు. వెంటనే అతడిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకొని సీజ్ చేసి ఖేడ్ ఎక్సైజ్ కార్యాలయంలో అప్పగించినట్లు సీఐ శంకర్ తెలిపారు.

నాన్న ప్రోత్సాహంతోనే..

- సంతృప్తి ఇవ్వని సాఫ్ట్ వేర్ ఉద్యోగం
- మొదటి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు
- ఫైల్ కాదు లైఫ్ అని నేర్చుకున్నా
- బైక్ రైడ్.. లాంగ్ డ్రైవ్ అంటే ఇష్టం
- లక్ష్యాన్ని సాధించే వరకు ప్రతి ఒక్కరూ శ్రమిస్తుండాలి
- సాక్షితో సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఉన్నత ఉద్యోగం, ప్రజాసేవ వైపు అడుగులు

సంగారెడ్డి జోన్

చిన్నప్పటి నుంచి రాజీలేకుండా ఎంత వరకైనా, ఎంతటి విద్యనైనా నేర్చుకోమని, చేసే ఉద్యోగం నలుగురికి సహకారం అందాలని నాన్న చెప్పేవారు. చేసే ఉద్యోగం ఉన్నతమైనదిగా ఉండి, ప్రజా సేవ చేయాలని చెప్పిన నాన్న మాటలే నేను ఉన్నత ఉద్యోగం సాధించేలా కృషి చేశాయి. ప్రతి ఒక్కరూ లక్ష్య సాధనకు కృషి చేసేందుకు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని అన్నారు **సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**. తన జీవితంలోని కొన్ని టర్నింగ్ పాయింట్‌లను 'సాక్షి'తో పంచుకున్నారు.



హైదరాబాద్‌లోనే బాల్యం.. విద్యాభ్యాసం

తల్లిదండ్రులది నల్గొండ జిల్లాలోని పోచంపల్లి పరిధిలోని జిబ్లక్‌పల్లి. కానీ చంద్రశేఖర్ పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోనే చదువుకున్నారు. అదే విధంగా సీబీఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ముంబాయిలో డిప్లొమా కోర్సు పూర్తి చేశారు. చాలా ఏళ్ల కిందట తండ్రి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి వ్యాపారంలో స్థిరపడ్డారు.

మొదటి ప్రయత్నంలోనే గ్రూప్స్-1లో 5వ ర్యాంకు

ప్రజాసేవ చేసేందుకు ఉన్నత ఉద్యోగం గురించి తెలుసుకున్నాను. 2009 సంవత్సరంలో గ్రూప్స్-1 నోటిఫికేషన్ విడుదల కాగానే ప్రణాళికబద్ధంగా చదువుకున్నాను. పట్టణంలోనే కోచింగ్ వెళ్లాను. మొదటి ప్రయత్నంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 5వ ర్యాంకు సాధించా. మొదటగా కరీంనగర్‌లో ట్రైనింగ్ పూర్తి చేసి, కరీంనగర్ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టా. సిద్దిపేట డీఆర్‌ఓగా, నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించి, బదిలీపై వచ్చి ప్రస్తుతం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా కొనసాగుతున్నా.

లాంగ్ డ్రైవ్ అంటే ఇష్టం

నాకు బైక్ రైడ్ అంటే చాలా ఇష్టం. స్నేహితులతో కలిసి లాంగ్ డ్రైవ్ బైక్ రైడ్ చేయడం జరిగింది. శ్రీనగర్ నుంచి లఢక్ బైక్ డ్రైవ్ చేశాం. అదే విధంగా ప్రతి రోజూ వాకింగ్‌తోపాటు యోగా అలవాటు.

టర్నింగ్ పాయింట్

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి

2004 సంవత్సరంలో క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా సాఫ్ట్ వేర్ రంగంలో ప్లేస్‌మెంట్ వచ్చింది. కానీ ఉద్యోగం సరైన విధంగా సంతృప్తి ఇవ్వకపోవడంతో వదిలేశాను. తిరిగి వచ్చి గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యి ఉద్యోగం సాధించడం జరిగింది.

అవగాహనతోనే సంక్షేమ ఫలితాలు

శిక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో గ్రామాలు పర్యటించినప్పుడు అనేక విషయాలతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాలు పొందేందుకు పడే ఇబ్బందులు తెలుసుకోవడం జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో పథకాలు ఏ విధంగా లబ్ధిపొందాలో తెలియక ఇబ్బందులు పడడం గమనించటం జరిగింది. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఏ విధంగా అందించాలో తెలుసుకున్నాను. రోజు రోజుకి సోషల్ మీడియా ప్రభావంతో పథకాలు లబ్ధి పొందడం తెలుసుకున్నారు.

ప్రణాళికతోపాటు సమయపాలన ముఖ్యం

పోటీ పరీక్షలు రాసే వారు ముందుగా సిలబస్ ఎంచుకొని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ప్రతి రోజూ సమయం వృథా చేయకుండా సమయ పాలన పాటిస్తూ చదువుకోవాలి. చదువుతోపాటు ప్రాక్టీస్ చేయాలి. ఎలాంటి ఒత్తిడికి లోను కాకూడదు. చదువుకునే సమయంలో సరైన లక్ష్యం ఎంచుకొని ఆ దిశగా అడుగులు వేయాలి. విషయ పరిజ్ఞానం పెంపొందించుకుంటూ ముందుకు సాగాలి. లక్ష్యం సాధించే వరకు శ్రమ పడుతూ ఉండాలి. అలా అయితనే విజయం సాధిస్తారు.



ఎప్పటికప్పుడూ ఫైల్‌ను క్లియర్ చేస్తా

శిక్షణతో పాటు క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటనలకు వచ్చినప్పుడు అనేక విషయాలు తెలుస్తాయి. అందులో భాగంగా సమస్యల పరిష్కారానికి మన దగ్గరకు వచ్చేవి ఫైల్ కాదు లైఫ్ అని నేర్చుకున్నా. అంటే ఫైల్‌ని తిరగేస్తే వారి జీవితం ఉంటుందని తెలుసుకున్నా. అందుకే ఎప్పటికప్పుడూ ఫైల్‌లను క్లియర్ చేయటం నాకు అలవాటు.

తప్పుడు పత్రాలు సృష్టించి భూమి ఆక్రమణ

దుబ్బాకటౌన్: నకిలీ పత్రాలను సృష్టించి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన బత్తిని సతీష్ కుమార్ అధికారులను వేడుకున్నారు. గురువారం లచ్చపేటలో ఆయన మాట్లాడుతూ.. తనకు పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన 10 ఎకరాల వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని రాజన్న సిరిసిల్లకు జిల్లా కేంద్రానికి చెందిన ఎర్రగుంట భరత్ మున్సిపల్ కార్యాలయానికి సంబంధం లేకుండా తప్పుడు పత్రాలను సృష్టించాడని ఆరోపించారు. తప్పుడు పత్రాలతో అప్పటి సబ్ రిజిస్ట్రార్ ఆయేషా తబస్సుం సహకారంతో నాలా కన్వర్షన్ లేకుండానే 1,805 గజాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. మున్సిపల్ కార్యాలయానికి సంబంధం లేకుండా 6-49/1 అనే ఇంటి నంబర్‌పై రివిజన్ రికార్డును సృష్టించాడని ఆ గ్రామంలో ఇంటి నంబర్ లేదని ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. అతడిపై కఠిన చర్యలు తీసుకొని ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరాడు. అలాగే సబ్ రిజిస్ట్రార్ ఆయేషా తబస్సుం పై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్‌కు గతంలోనే ఫిర్యాదు చేశామన్నారు. ఇది ఇలా ఉండగా తప్పుడు పత్రాలు ఇచ్చాడని అప్పట్లో ఆయేషా ఎర్రగుంట భరత్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం.


మాట్లాడుతున్న సతీష్ కుమార్

టీచర్ ప్రాణం తీసిన కోతి

- బైక్‌కు అడ్డురావడంతో కిందపడి మృతి
- చేర్యాల మండలంలో విషాదం


ధర్మారెడ్డి (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): బడికెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పాలన్న ఆతృతతో వెళ్తున్న ఓ ఉపాధ్యాయుడు కోతి కారణంగా ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన చేర్యాల పట్టణ శివారు బండపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, ఎస్ఐ నీరేశ్ కథనం మేరకు.. చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన పర్పాటకం ధర్మారెడ్డి(49) చుంచనకోట ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లే క్రమంలో పట్టణ శివారులో బండపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఒక్కసారిగా కోతి అడ్డువచ్చింది. కోతిని తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో ధర్మారెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ధర్మారెడ్డి మృతితో విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు శోక సంద్రంలో మునిగిపోయారు. స్వగ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మహిళ దారుణ హత్య

- పోలీసుల అదుపులో నిందితులు
- గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలో ఘటన


శాంత (ఫైల్)

నర్సాపూర్ రూరల్/ జిన్నారం (పటాన్‌చెరు): మహిళ దారుణ హత్యకు గురై ఎముకలతో మృతదేహం లభ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డి తండాకు చెందిన అంగోత్ శాంత (45) సెప్టెంబర్ 11వ తేదీన నర్సాపూర్ మార్కెట్‌లో కూరగాయలు కొనేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మరుసటి రోజు నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ముగ్గురు నిందితులు..

గిరిజన మహిళ శాంతని హత్య చేసినట్లు అనుమానం రావడంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. అనుమానం ఉన్న ఎల్లారెడ్డి తండాకు చెందిన అరుణ, కొండాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, వెంకటయ్యను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో ముగ్గురు కలిసి హత్య చేసి సంగారెడ్డి జిల్లా నల్లవల్లి అటవీ ప్రాంతంలో తగులబెట్టినట్లు తెలిసింది. గురువారం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పిలిపించగా అక్కడ దుస్తులు చూసి శాంతిగా గుర్తించారు. ఈ విషయమై నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డిని వివరణ కోరగా.. నిందితులు అదుపులో ఉన్న మాట వాస్తవమే అని పూర్తి దర్యాప్తు చేసిన తర్వాత రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నారాయణఖేడ్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నారాయణఖేడ్ మండలం పీర్లతండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పీర్లతండాకు చెందిన వడిత్యా విఠల్ నాయక్(30)కు కొద్దిపాటి వ్యవసాయభూమి ఉంది. చెరకు నరికే సీజన్‌లో కుటుంబీకులతో సహా ఎద్దుల బండితో వలసెళ్లి చెరకు నరికి, బండిపై తోలుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈ మధ్య ఎద్దులను విక్రయించాడు. కుటుంబాన్ని పోషించుకునేది ఎలా అని మదనపడుతూ తండా శివారులోని చిమ్యానాయక్ చేనులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సవితాబాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి


చెక్కు అందజేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రానికి చెందిన రేణుక, కూడవెల్లికి చెందిన ముత్తయ్యలు అనారోగ్యానికి గురికాగా మెరుగైన వైద్యం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేశారు. దీంతో ప్రభుత్వం వారికి మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, నాయకులు రాజు, పర్శ రాములు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యాసిడ్ తాగి..

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మనోహరాబాద్(తూప్రాన్): మద్యం మత్తులో యాసిడ్ తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గురువారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన ర్యాకల చంద్రంగౌడ్ (63) ఓ పరిశ్రమలో పని చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికొచ్చిన చంద్రంగౌడ్ మద్యం మత్తులో బాత్‌రూమ్‌లో ఉన్న యాసిడ్‌ను మందు అనుకొని తాగాడు. వాంతులు చేసుకుంటున్న అతడిని భార్య చూసి వెంటనే చికిత్స నిమిత్తం ఎర్రగడ్డలోని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న కుమారుడు ర్యాకల కృష్ణకాంత్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక


దుబ్బాకటౌన్: విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుజాత



గజ్వేల్‌రూరల్: ఎంపికైన క్రీడాకారులు

దుబ్బాకటౌన్: రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు దుబ్బాక సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సుజాత గురువారం తెలిపారు. గత నెల జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో కబడ్డీలో సాయికిరణ్ , చెస్‌లో హర్షవర్ధన్, అథ్లెటిక్స్‌లో అరవింద్, షాట్‌పుట్, హై జంప్‌లో నరేశ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. 68వ రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు.

చెస్ పోటీలకు 20 మంది

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎలియాస్‌రావు, పీడీలు భవానీ, రవికుమార్, విజయరేఖ, నగేశ్, రాజ్‌కుమార్, భవిత, విశాల తెలిపారు. గురువారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ.. పట్టణంలో జరిగిన ఉమ్మడి జిల్లా చెస్ పోటీల్లో ఒక్కో విభాగం నుంచి ఐదుగురు క్రీడాకారుల చొప్పున 20 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు అభినందించారు.

హ్యాండ్ బాల్ పోటీలకు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని నాగసముద్రాలలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండియర్ విద్యార్థి జక్రిపోతుల శ్రీకాంత్ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ భరత్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మద్దూరు మోడల్ స్కూల్‌లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి గోల్ కీపర్‌గా ఎంపికయ్యాడు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

ఖోఖో పోటీలకు పొడ్చంపల్లి విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పొడ్చంపల్లి విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విద్యార్థుల వివరాలను వెల్లడించారు. ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో నవ్యశ్రీ, హ్యాండ్ బాల్ పోటీల్లో వంశీ, అక్షయ ఎంపికయ్యారని, వీరంతా త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రతిభ చాటిన రీచా

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మోడల్ స్కూల్ విద్యార్థిని రీచా రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు మోడల్ స్కూల్/కళాశాల ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని గురువారం తెలిపారు. జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -19 విభాగంలో జరిగిన క్రీడల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

- భార్యాభర్తలకు గాయాలు
- పోలీసుల అదుపులో డ్రైవర్

కొండపాక(గజ్వేల్): బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొండపాక గ్రామ శివారులో చోటు చేసుకుంది. మండల పరిధిలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన భార్యాభర్తలు సముద్రాల (చాకలి) రేణుక, ఆంజనేయులు తాపీ మేస్త్రీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గురువారం ఉదయం విశ్వనాథపల్లిలో కూలీ పనుల కోసం ఇద్దరూ బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కొండపాక గ్రామ శివారులో బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. రేణుకకు తీవ్ర గాయాలు కాగా, భర్తకు స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ సాయంతో క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డ్రైవర్‌కు దేహశుద్ధి

తాగిన మత్తులో లారీని వేగంగా నడిపి బైక్‌ను ఢీకొట్టి ఆపకుండా వెళ్తున్న డ్రైవర్‌కు కొండపాక గ్రామస్తులకు దేహశుద్ధి చేశారు. కొండపాకలోని ప్రభుత్వ పాఠశాల వద్ద లారీని పట్టుకొని మహబూబ్‌నగర్ జిల్లా తాండూర్‌కు చెందిన డ్రైవర్ శ్రీరాములును చితకబాదారు. కుకునూరుపల్లి పోలీసులు డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు తో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

కుక్క పిల్లను తెస్తే రూ.25 వేలు నజరానా

- తప్పిపోవడంతో కాలనీలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన యజమాని
- భెల్ కార్మికుడు తీసుకురావడంతో నగదు అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తప్పిపోయిన కుక్క పిల్లను తెచ్చి ఇచ్చినందుకు ఓ యజమాని ఏకంగా రూ.25 వేలు బహుమతిగా ఇచ్చాడు. వివరాల్లోకి వెళ్తే.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్ కాలనీలో ఉండే డాక్టర్ కార్తీక్ తన ఇంట్లో షీట్జు బ్రీడ్‌కు చెందిన కుక్క పిల్లను పెంచుకుంటున్నాడు. దీపావళి పండుగ రోజు టపాసుల శబ్దానికి భయపడి ఇంట్లో నుంచి కుక్కపిల్ల పారిపోయింది. దాని కోసం డా.కార్తీక్ కుటుంబ సభ్యులు కాలనీలో వెతికినా దొరకలేదు. దీంతో తన పెంపుడు కుక్కపిల్లను తెచ్చి ఇచ్చిన వారికి రూ.10 వేలు నగదు బహుమతి ఇస్తామని కరపత్రాలను కాలనీలో పంచి పెట్టాడు. అయినా ఆచూకీ దొరకలేదు. గురువారం కాలనీలో ఏకంగా కుక్క పిల్లను తెచ్చి ఇస్తే రూ.25వేల నగదు బహుమతి ఇస్తామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. అదే కాలనీకి చెందిన భెల్ కార్మికుడు రామా కుటుంబ సభ్యులు ఆ కుక్క పిల్లను గుర్తించి యజమాని వద్దకు చేర్చారు. దీంతో యజమాని ప్రకటించిన విధంగా రామాకు రూ.25 వేల నగదు బహుమతి ఇచ్చాడు. ఈ విషయం కాలనీలో చర్చనీయాంశంగా మారింది.



కాలనీలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మరో ఐదు సెట్విన్ శిక్షణా కేంద్రాలు

- 17న హుస్నాబాద్‌లో, నెలాఖరున జహీరాబాద్‌లో ప్రారంభం
- బోధకుల నుంచి దరఖాస్తులు స్వీకరణ
- సంస్థ ఎండీ వేణుగోపాల్‌రావు, కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ వేణుగోపాలరావు, చైర్మన్ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ సేవలను త్వరలో విస్తరించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు సంస్థ ఎండీ వేణుగోపాల్‌రావు, కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం జహీరాబాద్‌లో వచ్చిన సందర్భంగా త్వరలో ప్రారంభించనున్న సెట్విన్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జహీరాబాద్, హుస్నాబాద్, నల్గొండ, జడ్చర్ల, మహబూబ్‌నగర్‌లలో కొత్తగా శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 23 కేంద్రాలు ఉన్నాయని, అదనంగా ఐదు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. సంస్థ ద్వారా 60 కోర్సుల్లో యువతీ యువకులు శిక్షణ పొంది దేశ, విదేశాల్లో ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు. 17న హుస్నాబాద్‌లో మొదటి సెంటర్, నెలాఖరులో జహీరాబాద్‌లో రెండో సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జహీరాబాద్‌లో ప్రధానంగా సీసీ కెమెరాల రిపేరింగ్, ఏసీ, మొబైల్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యుటీషియన్, టైలరింగ్, ప్రీ ప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్ లాంటి కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆయా కోర్సులను బోధించేందుకు వీలుగా డిగ్రీ ఉత్తీర్ణులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, 15 లోపు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బోధకులకు 19న ఇంటర్వ్యూ నిర్వహించి, వారి నైపుణ్యతను బట్టి నెలకు రూ.17వేల నుంచి రూ.20వేల వరకు వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.